సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 14 । డిసెంబర్ । 2024



సోమశిలలో 72.71 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 72.71 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 7,504 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, డెల్టాకు 2,050, ఉత్తర కాలువకు 600, దక్షిణకాలువకు 150, కండలేరుకు 1200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.79,550
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,200
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,416
నవర (8 గ్రాములు)	రూ.59,328

గరిష్టం/కనిష్టం
29.4 /24.8

వాతావరణం

జిల్లాలో శనివారం వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు క్షీణించడంతో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. శుక్రవారం గాలిలో తేమ 77 శాతం ఉంది.

న్యూస్‌రీల్

ఫీజు బకాయిలు చెల్లించాలి

- కలెక్టరేట్ ఎదుట పీడీఎస్‌యూ ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నెల్లూరురూరల్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం సునీల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యారంగ సమస్యలు ఆ శాఖ మంత్రి లోకేశ్ పట్టించుకోవడం లేదన్నారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో ఆరు నెలల నుంచి మెస్ బిల్లులు ఇవ్వకపోవడంతో నాణ్యమైన భోజనం పెట్టలేక పోతున్నారన్నారు. ఫీజు బకాయిలు విడుదల కాకపోవడంతో ప్రైవేట్ విద్యా సంస్థలు విద్యార్థులను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, దీంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారన్నారు. విద్యాదీవెన, వసతిదీవెన, అమ్మఒడి వంటి పథకాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి షారూఖ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యాసంస్థలను పట్టించుకోకుండా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ము కాస్తుందన్నారు. సీఎం చంద్రబాబు విద్యారంగ సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించాలని, లేదంటే రాజీనామా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు కె ఆశిర్, జిల్లా కమిటీ సభ్యులు షేక్ మస్తాన్, నవీన్, హర్ష, వైపూజిత, చరణం, దాదాపు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పోలీస్ స్పోర్ట్స్ మీట్

నెల్లూరు (క్రైమ్): జిల్లా పోలీసు యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ ఈ నెల 15 నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా పోలీసు కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. వాస్తవానికి స్పోర్ట్స్ మీట్ ఈ నెల 13వ తేదీ నుంచి నిర్వహించాల్సి ఉంది. వర్షాల కారణంగా 14కు వాయిదా వేశారు. వర్షాల కారణంగా కవాతు మైదానంలోని ట్రాక్, కోర్టులు దెబ్బతినడంతో ఆదివారం నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు నీటి సంఘాల ఎన్నికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో 13 డిస్ట్రిబ్యూటరీ కాలువలకు, 490 వాటర్ యూజర్ అసోసియేషన్లకు, 3,698 టీసీలకు ఎన్నికలు శనివారం జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 2.95 లక్షలు మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల నిర్వహణకు 9,120 మంది సిబ్బందిని నియమించారు. శనివారం ఉదయం 8 గంటలకు టీసీ (ప్రాదేశిక నియోజకవర్గం)లకు సంబంధించి సర్వసభ్య మండలి సమావేశం ప్రారంభిస్తారు. 9 గంటల నుంచి అనుమతికి ఆమోదం తెలుపుతారు. గుర్తింపు కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, గ్రామ రెవెన్యూ అధికారి జారీ చేసిన గుర్తింపు పత్రం, తదితర ధ్రువీకరణలను బట్టి ఓటర్ లిస్టులో ఓటర్ వివరాలు సరైనవో కావో నిర్ణయిస్తారు. ఆ తర్వాత ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుడి ఫామ్-4.1, ఫామ్ -4.2, ఫామ్ -4.3, ఫామ్ -4.4 కాలాలను పరిశీలించి అభ్యర్థులను నిర్ణయిస్తారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు నీటి సంఘాల అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు ఎన్నికను నిర్వహిస్తారు. ఈ ఎన్నికలు ఏకగ్రీవంగా, చేతులెత్తే పద్ధతి, రహస్య ఓటింగ్ పద్ధతుల్లో నిర్వహిస్తారు.

పైసా విదల్చని ప్రభుత్వం

నీటి సంఘాల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం పైసా కూడా విదల్చలేదు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు రూ.20 లక్షల ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే నిధుల మంజూరు లేకపోవడంతో ఎన్నికల ప్రత్యేకాధికారులు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మూడుసార్లు వాయిదా వేసినా ఎన్నికలకు నిధులు కేటాయించకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. రైతుల కష్టాలను తీరుస్తామని చెప్పే ప్రభుత్వం సీజన్ మధ్యలో ఎన్నికలు నిర్వహించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చంద్రబాబు మెడలు వంచుతాం

ప్రతి విషయంలో రైతుల పక్షాన నిలబడతాం

- నమ్మించి నట్టేట ముంచడం బాబుకు అలవాటే
- పెట్టుబడి సాయం, ఉచిత పంటల బీమా అమలు చేయాల్సిందే
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- రైతుల భారీ ర్యాలీ, ధర్నా ఎండ్లబండ్ల ప్రదర్శన
- అన్నదాతల ఆందోళనకు పార్టీ సంపూర్ణ మద్దతు

రైతుల సమస్యలపై వైఎస్సార్‌సీపీ పోరుబాట పట్టింది. ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు.. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు పెట్టుబడి సాయం తక్షణమే విడుదల చేయాలని, ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు పంపిణీ చేయాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద రైతులు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు, శ్రేణుల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. తొలుత వీఆర్‌సీ కూడలి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి అనంతరం భారీగా తరలివచ్చిన రైతులు, పార్టీ శ్రేణులతో కలిసి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడ ధర్నా అనంతరం జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు వినతిపత్రం ఇచ్చారు.





వీఆర్‌సీ సెంటర్ నుంచి కలెక్టరేట్‌కు భారీ ర్యాలీగా వస్తున్న రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌చార్జ్‌లు

సాక్షి, ప్రతినిధి, నెల్లూరు/నెల్లూరు (అర్బన్): చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పేరుతో సంవత్సరానికి రూ.20 వేలు పెట్టుబడి సాయం అందజేస్తామని హామీ ఇచ్చి, ఆ హామీని తుంగలో తొక్కి రైతుకు సున్నం పెట్టారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. రైతులకు అందాల్సిన ప్రతి మేలు విషయంలో చంద్రబాబు మెడలు వంచి తీరుతామని, ఈ రోజు నిర్వహించిన ఉద్యమం ట్రయల్ మాత్రమే అని, ఇకపై ముస్ముందు రైతు సమస్యలపై తీవ్రతరం చేస్తామన్నారు. తమ ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో రూ.12,500 చొప్పున నాలుగేళ్లు పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పినా, అధికారంలోకి వచ్చాక మరింత పెంచి రూ.13,500 వంతున, ఐదేళ్లు ఇచ్చారని గుర్తు చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తర్వాత రైతుల గురించి ఆలోచించి వారికి అండగా నిలిచిన ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే అది ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. తమ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకానికి చంద్రబాబు తూట్లు పొడిచారన్నారు. ఎరువులకు సంబంధించి రైతులు ముందుగానే డబ్బులు చెల్లించాలని, అప్పుడే ఎరువులు వస్తాయంటున్నారన్నారు. ఇప్పటికే శ్రీకాకుళం నుంచి ఒంగోలు వరకు ఖరీఫ్ సీజన్ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. దీంతో బస్తాకు రూ.300 నుంచి 400 వరకు తక్కువ ధరకే ధాన్యాన్ని అమ్ముకుంటున్నారన్నారు. ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, పెట్టుబడి సాయం ఇవ్వాలని, ఎరువులు పార్టీలకతీతంగా రైతుభరోసా కేంద్రాల వద్ద ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ పార్టీ రైతులకు అండగా నిలబడి పోరాటాలు చేస్తూ ప్రభుత్వం మెడలు వంచుతామన్నారు. సర్వేపల్లిలో టెండర్లు పూర్తి కాకముందే పనులు చేసి రూ.కోట్లు దండుకుంటున్న ఘనులు టీడీపీ నేతలన్నారు. చంద్రబాబు నిరంకుశ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా, పెంచిన రూ.15 వేల కోట్ల కరెంట్ చార్జీలు తగ్గించాలని, ఈ నెల 27న, విద్యాదీవెన, వసతి దీవెన నిధులు విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని జనవరి 3న ఆందోళనలు చేయబోతున్నామన్నారు.

దేశంలో ఎవరూ చెప్పలేని అబద్ధాలు చంద్రబాబుకే సాధ్యం

– పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ, నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి



దేశంలో ఎవరూ చెప్పలేని అబద్ధాలు, చేయలేని మోసాలు చంద్రబాబుకే సాధ్యం. నిరుద్యోగ భృతి, ఉద్యోగుల ఐఆర్, రైతులకు పెట్టుబడి సాయం, తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుతో ఇలా అన్ని వర్గాల వారిని మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు.

ఎన్నికల హామీలను అమలు పరచాలి

– ఆనం విజయకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, నెల్లూరు రూరల్ నియోజకవర్గం



గత ఎన్నికల సందర్భంగా చంద్రబాబు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి. దేశంలో ఎక్కువ మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తు న్నారు. అలాంటి రైతులకు తక్కువ ధరలకే ఎరువులు ఇస్తామని, పెట్టుబడి సాయం రూ.20 వేలకు పెంచుతామని మాయమాటలు చెప్పారు. పార్టీలకతీతంగా రైతులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. రైతుల పక్షాన తాము పోరాడుతాం.

సూపర్ సిక్స్‌లో ఏ ఒక్కటీ అమలు చేయలేదు

– రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే



సూపర్ సిక్స్ పథకాల పేరుతో చంద్రబాబు ప్రజలను ఏమార్చి అధికారంలోకి వచ్చి, మోసం చేశారు. ఆ పథకాలకు సంబంధించి మా ప్రభుత్వంలోనే లబ్ధిదారులను ఎంపిక చేసి ఆర్థిక సాయం అందించాము. వీరికి ఆర్థిక సాయం అందజేయకపోగా, కనీసం ఫలానాప్పుడు ఇస్తామనేది చెప్పడం లేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేశారు. కావలి చెరువు, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, సంగం–కావలి కాలువ పనులను మా ప్రభుత్వ హయాంలోనే చేపట్టాం. అవి ఇప్పుడు ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం.

పథకాలు ఏమయ్యాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు

– బుర్రా మధుసూదన్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే కందుకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి



మేము ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు గతంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇస్తున్న పథకాలు ఏమయ్యాయని ప్రశ్నిస్తున్నారు. చంద్రబాబు అధికారంలో ఉంటే అతివృష్టి, అనావృష్టి కాని వస్తాయి. అధికారంలోకి వస్తే.. పింఛన్ పెంచి ఇస్తామని చెప్పి.. నెలకు పాతికవేలు లెక్కన కోతలు పెట్టారు. ఇప్పుడు సర్వే పేరుతో మరిన్ని పింఛన్లకు కోత విధిస్తున్నారు. పంట బీమాను రద్దు చేసి రైతులను మోసం చేశారు.

కదం తొక్కిన కర్షకులు

- అన్నదాతల నినాదాలతో ప్రతిధ్వనించిన సింహపురి
- వారితో కలిసి వైఎస్సార్‌సీపీ శ్రేణుల భారీ ర్యాలీ

నెల్లూరు (బారకాసు): రైతుల నినాదాలతో నెల్లూరు నగరం ప్రతిధ్వనించింది. చంద్రబాబు ప్రభుత్వ తీరును ఎండగడుతూ రైతులు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కదం తొక్కారు. వేలాదిగా తరలి వచ్చిన రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అన్నదాతను ఆదుకోవాలి, రైతులకు అండగా నిలవాలి, జై జగన్.. జైజై జగన్, జయహో జగన్.. నినాదాలు చేస్తూ భారీగా సాగిన ర్యాలీతో నగర రోడ్లు స్తంభించాయి. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో రైతుకు ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం, ధాన్యానికి కనీస మద్దతు ధర, ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలి, రైతుపై అదనపు భారం మోపే చర్యలను మానుకోవాలి వంటి ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లూరులో నిర్వహించిన 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' కార్యక్రమంలో భాగంగా రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు వీఆర్సీ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ మంత్రి, పార్టీ పొలిటికల్ అడ్వైజర్ కమిటీ సభ్యుడు డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీ, పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళి, కావలి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, ఉదయగిరి ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, కందుకూరు ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయ్‌కుమార్ రెడ్డి, పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఖలీల్ అహ్మద్, సెంట్రల్ బ్యాంకు మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీఏఏబీ మాజీ చైర్మన్ నిరంజన్‌బాబు రెడ్డి, పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు పూండ్ల అచ్యుత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి ఖలీల్ మాట్లాడుతూ రైతులకు అండగా నిలిచేది తమ పార్టీ మాత్రమేనన్నారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి పాలన రానుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు అప్పుడే సంతోషంగా ఉంటారన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు.



వైఎస్సార్‌సీపీ నాయకుడు పూండ్ల అచ్యుత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం చూస్తే ప్రభుత్వంపై ఆరు నెలల్లో ఎంతటి వ్యతిరేకత ఉందో అర్థమవుతోందన్నారు. ఇది ప్రభుత్వ పతనానికి తొలి మెట్టుగా చెప్పవచ్చన్నారు.



వీఆర్‌సీ సెంటర్లో అన్నదాతకు అండగా ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి కాకాణి



వినూత్నంగా ఎడ్లబండిపై ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

రైతు పోరాటంలో భాగంగా ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి ఐదు ఎడ్లబండ్లపై రైతులతో కలిసి చిల్డ్రన్స్ పార్కు నుంచి వీఆర్‌సీ వరకు వినూత్నంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో చంద్రశేఖర్‌రెడ్డి తలపాగా ధరించి ఎడ్ల బండిని నడుపుతూ రైతు ఉద్యమానికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

చంద్రబాబువి మోసపూరిత మాటలు

– కిలివేటి సంజీవయ్య, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే



కూటమి ప్రభుత్వం పాలనను గాలికొదిలేసింది. చంద్రబాబు మోసపూరిత మాటలతో గద్దెనెక్కారు. మా ప్రభుత్వంలో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ఎన్ని విధాలుగా మేలు చేయవచ్చునో అన్ని రకాలుగా నిర్ణయాలు తీసుకున్నారు. ప్రతి నియోజకవర్గంలో అగ్రికల్చర్ ల్యాబ్ ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తనాలు రైతులకు అందేలా చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని గిట్టుబాటు ధరలకు కొనేలా చేశారు. అయితే ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ చంద్రబాబు రైతులను ఇబ్బంది పెడుతున్నారు. రైతులను కలుపుకుని హామీలు అమలు చేసేంత వరకు పోరాడుతాము.

చంద్రబాబు మోసపూరిత బుద్ధి మారదు

– మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి



చంద్రబాబుది ఆది నుంచి మోసపూరిత బుద్ధే. ఇది ఎప్పటికీ మారదు. ఈ దఫా అయినా చంద్రబాబు మారి ఉంటాడేమో, మంచి చేస్తాడేమో అని భ్రమపడిన రైతులు కూటమికి ఓట్లు వేశారు. పుట్టుకతో వచ్చిన బుద్ధులు పుడకలతో పోవన్నట్లు చంద్రబాబు బుద్ధి మారలేదు. రైతులను మరోసారి మభ్యపెట్టారు. మేనిఫెస్టోను మార్చమని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరగా మనం చేయగలిగిందే మేనిఫెస్టోలో పెట్టాం.. చేయలేనిది పెట్టలేమంటూ ఉన్నది ఉన్నట్లు చెప్పారు. చంద్రబాబులా దొంగ హామీలు మా నేత ఇవ్వలేదు.

వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు

– మేరిగ మురళి, ఎమ్మెల్సీ



దేశంలో వ్యవసాయం మీదనే ఆధారపడి ఎక్కువ మంది ప్రజలు బతుకుతున్నారు. వ్యవసాయం దండగ అన్న వ్యక్తి చంద్రబాబు. కరోనా వంటి సంక్షోభంలోనూ మా నేత జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేసిన తీరును చూసి నేర్చుకోవాలి. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల్లోకి వస్తున్నారు.. ఇక ఈ ప్రభుత్వానికి ముచ్చెమటలు పట్టి అయినా ప్రజలకు మేలు జరిగేలా చేస్తాం. ప్రజలు స్థిరమైన నాయకత్వం కోసం ఎదురు చూస్తున్నారు. చంద్రబాబును క్షమించరు.



బైక్‌లతో పర్వతరెడ్డి భారీ ర్యాలీ



ధర్నాలో మాట్లాడుతున్న కాకాణి



జేసీ ఛాంబర్‌లో వైఎస్సార్‌సీపీ నేతలు



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తూ..

జర్నలిస్టులపై దాడి.. అప్రజాస్వామికం

- నిందితులను కఠినంగా శిక్షించాలి
- ఏపీయూడబ్ల్యూజే నాయకుల డిమాండ్
- కొవ్వొత్తులతో నిరసన

నెల్లూరు (బారకాసు): జర్నలిస్టులపై దాడి.. ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని, దాడులకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) నాయకులు డిమాండ్ చేశారు. వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం వేముల మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న నీటి సంఘాల ఎన్నికల కవరేజీకి వెళ్లిన 'సాక్షి' మీడియా ప్రతినిధులపై టీడీపీ మూకలు విచక్షణా రహితంగా రాళ్లు, కర్రలతో దాడి చేశాయన్నారు. దాడిలో 'సాక్షి' రిపోర్టర్లు శ్రీనివాస్, రాజారెడ్డి, కెమెరామెన్ రాముకు గాయాలయ్యాయన్నారు. కెమెరా ధ్వంసమైందని తెలిపారు. ఇటువంటి ఘటనలకు పాల్పడటం దుర్మార్గమన్నారు. ఈ ఘటనకు నిరసనగా ఏపీయూడబ్ల్యూజే, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, సామ్నా జిల్లాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో కొవ్వొత్తులతో తమ నిరసన తెలియజేశారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మీడియాపై దాడి చేయడం ఫ్యాషన్‌గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పక్షాలు రాజకీయంగా చూసుకోవాలని కానీ జర్నలిస్టులపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. దాడి చేసిన వారిపై హత్యాయత్నం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. ప్రభుత్వాలు మారినా జర్నలిస్టులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయని ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఐజేయూ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ మీడియా జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మస్తాన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి, ఏపీయూడబ్ల్యూజే, టి.రమేష్‌బాబు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు, సామ్నా జిల్లా కార్యదర్శి హనుక్‌తో పాటు పలువురు ప్రింట్ అండ్ మీడియా జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు.



గాంధీబొమ్మ సెంటర్‌లో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న జర్నలిస్టు సంఘాల నేతలు

ఆశ పెట్టి.. నగదు కాజేసి..

- నిరుద్యోగులను ముంచుతున్న కేటుగాళ్లు
- రూ.లక్షలు వసూలు చేస్తున్న వైనం
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతోనే అధికంగా మోసాలు
- జిల్లా పోలీసు కార్యాలయానికి వస్తున్న బాధితులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు



నెల్లూరు(క్రైమ్): కొలువుల వేటలో ఉన్నవాళ్లు, చదువుకున్న వారిని లక్ష్యంగా చేసుకుని కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. దేశ, విదేశాల్లో ఉద్యోగాలు, రూ.లక్షలు ప్యాకేజీ అంటూ ఆశ చూపి అందినకాడికి దోచేస్తున్నారు. ఈ తరహా మోసాలు ఇటీవల బాగా పెరిగాయి. ప్రతి సోమవారం నెల్లూరులో జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితులు పెద్ద సంఖ్యలో పోలీసు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చి న్యాయం చేయాలని కోరుతున్నారు.

మాయమాటలు చెప్పి..

కొందరు వ్యక్తులు కొలువుల వల వేస్తూ నిరుద్యోగులు, వారి తల్లిదండ్రులే లక్ష్యంగా రూ.లక్షలు దోచేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వస్తే ఆర్థికంగా స్థిరపడొచ్చని, కుటుంబం కష్టాల్లో నుంచి గట్టెక్కుతుందని నమ్మించి నగదు వసూలు చేసి పలాయనం చిత్తగిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగం వస్తే జీవితంలో స్థిరపడి పోయినట్లేనని, వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరమే లేదని, ఖర్చుకు వెనుకాడకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లోనూ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆశ పెట్టి ఉచ్చులోకి దింపుతున్నారు. డబ్బు చేతికందాక మాయమైపోతుండగా.. మరికొందరు తమకున్న పలుకుబడితో బాధితులపై బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారు. జిల్లాలో పలువురు మోసం చేయడాన్నే వృత్తిగా పెట్టుకున్నారు.

మోసపోతున్నారిలా..

ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి నియామకాలు ఒక క్రమపద్ధతిలో జరుగుతాయి. ముందుగా ప్రకటన ఇచ్చి రాతపరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు. డబ్బులు కట్టించుకుని జాబ్ ఇవ్వరు. అనేక మందికి దీనిపై కనీస అవగాహన లేకపోవడంతో మోసాలకు గురవుతున్నారు. జీవితంలో స్థిరపడొచ్చని గుడ్డిగా నమ్మి రూ.లక్షలు ధారపోస్తున్నారు.

సోషల్ మీడియాలో..

ఉన్నత చదువులు అభ్యసించిన వారు ఉద్యోగాన్వేషణలో భాగంగా సోషల్ మీడియాలో మోసగాళ్లు ఇచ్చే ప్రకటనలు, మోసపూరిత కన్సల్టెన్సీలను నమ్మి వారిని సంప్రదిస్తున్నారు. దేశ, విదేశాల్లోని సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన వెంటనే ముందు, వెనుకా ఆలోచించకుండా డబ్బు ఇస్తున్నారు.

ఇవి గుర్తుంచుకోవాలి

డబ్బులు కట్టించుకుని ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వరనే విషయాన్ని గమనించాలి. ఉద్యోగ ప్రకటన సరైనదో కాదో క్షుణ్ణంగా పరిశీలించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ అందులో ఉన్న మొబైల్ నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోరాదు. ఒకసారి ఆ సంస్థ ప్రధాన కార్యాలయం లేదా శాఖ కార్యాలయానికి వెళ్లి నిర్ధారించుకోవాలి.

పరువు పోతుందని..

ఉద్యోగార్థులు దళారులను నమ్మిమోసపోవద్దని పోలీసు అధికారులు చెబుతున్నా జిల్లాలో బాధితులు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. ఇందులో పది శాతం మంది కూడా ఫిర్యాదులు చేసేందుకు ముందుకు వస్తున్న దాఖలాల్లేవు. అనేకమంది పరువు పోతుందని, ఉన్నత చదువులు చదువుకుని కూడా మోసపోయారంటారని పోలీసుల దృష్టికి తీసుకెళ్లడం లేదు. అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. మోసాలకు గురైతే వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని చెబుతున్నారు.

- ▶▶ నెల్లూరు చిన్నబజారు పరిధిలో నివాసం ఉంటున్న శివకుమార్‌కు ప్రభుత్వ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని పొదలకూరురోడ్డుకు చెందిన ఓ వ్యక్తి, విజయవాడకు చెందిన మరో వ్యక్తి రూ.3.50 లక్షలు తీసుకుని మోసగించారు.
- ▶▶ ఆత్మకూరుకు చెందిన ఓ వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.4.71 లక్షల నగదు తీసుకుని ఆత్మకూరుకు చెందిన మహిళను మోసం చేశాడు.
- ▶▶ ప్రముఖ బ్యాంక్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నగరానికి చెందిన ఓ వ్యక్తి ఇద్దరు మహిళలకు మాయమాటలు చెప్పి రూ.35 లక్షలను తీసుకున్నాడు.
- ▶▶ కలువాయికి చెందిన వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని అల్లూరుకు చెందిన మహిళ నుంచి రూ.4.20 లక్షలు తీసుకుని ఆ తర్వాత పట్టించుకోలేదు.
- ▶▶ నెల్లూరు నగరానికి చెందిన వ్యక్తి బెంగ ళూరు, హైదరాబాద్‌ల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలిప్పిస్తానని కొందరి నుంచి రూ.17 లక్షలు తీసుకుని తర్వాత స్పందించలేదు.
- ▶▶ నెల్లూరు నగరానికి చెందిన వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో ఓ యువకుడి నుంచి రూ.8 లక్షలు తీసుకున్నాడు.
- ▶▶ కలువాయికి చెందిన మహిళ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇపిస్తానని బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన ఓ మహిళ వద్ద రూ.4.25 లక్షలు తీసుకుని మోసగించింది.

ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి

- పోలీసులకు మహిళ ఫిర్యాదు

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తి నన్ను వేధించడమే కాకుండా కారుతో ఢీకొట్టబోయాడు. నా ప్రాణాలకు హాని ఉంది రక్షణ కల్పించాలని ఓ మహిళ శుక్రవారం నెల్లూరులోని చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. సీఏఎం కాంపౌండ్‌లో ఓ మహిళ ఒంటరిగా జీవిస్తోంది. అమృతరావు తన కుటుంబంతో కలిసి అదే కాంపౌండ్‌లో కొంతకాలంగా జీవిస్తున్నాడు. మహిళ ఒంటరిగా ఉండటాన్ని గమనించిన అతను ఆమెను వేధిస్తూ అసభ్యకర పదజాలంతో దూషించసాగాడు. దీంతో మహిళ ఈ ఏడాది ఫిబ్రవరిలో చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు అతడిని మందలించి పంపారు. అయినా ప్రవర్తనలో మార్పురాలేదు. ఈనెల 12వ తేదీన అతను ఆమెను కారుతో ఢీకొట్టబోయాడు. మహిళ తప్పించుకుని పరుగులు తీయడంతో అసభ్యకరంగా దూషించాడు. అతడి నుంచి తన ప్రాణాలకు హాని ఉందని రక్షణ కల్పించాలని బాధితురాలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

భూముల ధరలపై ఆరా

నెల్లూరు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం భూముల విలువను త్వరలో పెంచనున్న నేపథ్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న ధరలను శుక్రవారం జిల్లా రిజిస్ట్రార్ హరివర్మ ఆరాతీశారు. నగరంలోని ప్రధాన రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆయా ప్రాంతాలకు సంబంధించిన ప్రస్తుత ధరలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల విలువ పెంపునకు సంబంధించిన కమిటీకి జేసీ చైర్మన్‌గా ఉంటారన్నారు. ఆయన ఆదేశాలతో ప్రస్తుత ధరల వివరాలను పరిశీలిస్తున్నామన్నారు. పూర్తి నివేదికను జేసీకి సమర్పిస్తామన్నారు. కాగా ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదని వెల్లడించారు.

మహిమలూరు అభివృద్ధికి కృషి



ప్రభుత్వ వైద్యశాల వద్ద మొక్క నాటి నీరు పోస్తున్న సతీష్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, సత్యకుమార్ సహకారంతో మహిమలూరు అభివృద్ధికి కృషి చేస్తానని డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, భారత రక్షణ శాఖ సలహాదారు డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తన స్వగ్రామమైన మహిమలూరులో శుక్రవారం ఆయన పర్యటించారు. తొలుత గ్రామస్తులతో సమావేశమై అభివృద్ధి పనులు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేయనున్న జన ఔషధి భవనాలను పరిశీలించారు. తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్దకు చేరుకుని వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులతో మాట్లాడారు. డీఎంహెచ్ఓ పెంచలయ్య, డీసీహెచ్ మీరావలి తదితరులతో కలిసి వైద్యశాలలో నిర్వహించిన సమీక్షలో పాల్గొన్నారు. సతీష్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే మహిమలూరుకు మంత్రులను తీసుకొని వస్తానని, వైద్య ఆరోగ్య శాఖతోపాటుగా ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయిస్తామన్నారు. మొక్కలు నాటారు. గ్రామానికి చెందిన చింతలపల్లి సుధాకర్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండటంతో పరామర్శించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ అనూషా, దేవానంద్, బీజేపీ నాయకులు సురేంద్రరెడ్డి, కరటంపాటి సుధాకర్, స్థానిక నాయకులు వల్లూరు వెంకట రమణారెడ్డి, నారాయణ, చలమయ్య, డీఆర్‌డీఓ ఉద్యోగి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రయత్నాలు



కాలువ గేటును పైకి లేపేందుకు ప్రయత్నిస్తున్న సిబ్బంది

- 2 సెం.మీ. పైకి లేచిన రాళ్లపాడు గేటు
- తర్వాత తెగిపోయిన రోప్‌లు

లింగసముద్రం: రాళ్లపాడు ప్రాజెక్ట్ కుడి కాలువ గేటును బయటకు తీసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. గేటు శుక్రవారం రెండు సెంటీమీటర్లు పైకి లేచినట్లు డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆరోరోజు గేటును చైన్ బ్లాక్‌లు, రోప్‌లతో పైకి లేపేందుకు ప్రయత్నించగా రెండు సె.మీ. పైకి లేచిన తర్వాత చైన్ బ్లాక్‌కు ఉన్న చైన్‌లు, వాటికి బిగించిన రోప్‌లు తెగిపోయాయి. అదే విధంగా గేటును పైకి లేపేందుకు సిబ్బంది, ప్రైవేట్ మెకానిక్ బాషా, వైజాగ్ నుంచి వచ్చిన టెక్నీషియన్లు తదితరులు సాయంత్రం వరకు ప్రయత్నాలు చేశారు. అయినా గేటు పైకి లేవలేదు. చీకటి పడటంతో పనులను నిలిపివేసినట్లు డీఈ చెప్పారు. గేటు కాస్త పైకి లేవడంతో 60 క్యూసెక్కుల నీరు కాలువకు విడుదలైనట్లు వెల్లడించారు. శనివారం కూడా ప్రయత్నాలు చేస్తామన్నారు. పనులను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఉదయగిరి ఎమ్మెల్యే కాకార్ల సురేష్ లు పరిశీలించారు.

పెంచలకోనలో వైభవంగా పూజలు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో శుక్రవారం హనుమద్వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. పెనుశిల లక్ష్మీనరసింహస్వామికి అభిముఖంగా వెలసిన క్షేత్రపాలకుడైన ఆంజనేయ స్వామికి తెల్లవారుజామున ఐదు గంటలకు ప్రత్యేక అభిషేకం, పూలంగిసేవ చేశారు. 8 గంటలకు స్వామి ఉత్సవమూర్తిని తిరుచ్చిపై కొలువుదీర్చి కోన మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం వెయ్యి నామాలతో ఆకు పూజ చేపట్టారు. స్వామి మాలధారణ భక్తులు దీక్ష విరమించారు. ఉభయకర్తలుగా మధుసూదనరావు వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి, అర్చకులు శశిస్వామి, నాగరాజస్వామి, వినోద్‌స్వామి, సూర్యస్వామి, మల్లికార్జునస్వామి, ప్రసాద్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి క్షేత్రోత్సవం

నేటి నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు



మాట్లాడుతున్న ఎస్ఈ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను శనివారం నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తామని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ తెలిపారు. నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారోత్సవాల్లో భాగంగా రోజూ విద్యార్థులు, వినియోగదారులకు, సిబ్బందికి భవిష్యత్ తరాలకు ఇంధన వనరులను అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తామన్నారు. విద్యార్థులకు డివిజన్ స్థాయిలో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు, సెమినార్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కరపత్రాల పంపిణీ, రూరల్ ప్రాంతాల్లో ఎన్జీఓ, జనవిజ్ఞాన వేదికతో కలిసి రైతులకు అవగాహన కార్యక్రమాలు చేస్తామన్నారు.

జొన్నవాడలో దర్శన వేళల్లో మార్పు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ధనుర్మాసం సందర్భంగా జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో దర్శన వేళల్లో మార్పులు చేశామని ఆలయ ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16 నుంచి జనవరి 15వ తేదీ వరకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4:30 నుంచి రాత్రి 8 గంటల వరకు భక్తులు దర్శనం చేసుకోవచ్చన్నారు. శుక్రవారం మాత్రం ఉదయం 5:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4:30 నుంచి రాత్రి 9 గంటలవరకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పిస్తామన్నారు.



దీపం వెలిగిస్తున్న వేదపండితుడు

- ఆలయంలో శుక్రవారం కృత్తికా దీపోత్సవం వైభవంగా జరిగింది. వేద పండితులు ఆలయ గోపురంపై అఖండ దీపాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సరుకులు తెచ్చేందుకు వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కోవూరు: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని రామన్నపాళెం గేటు దగ్గర శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. టపాతోపు ప్రాంతానికి చెందిన పుల్లా కృష్ణకిశోర్ (38) సరుకులు తెచ్చేందుకు స్కూటీపై నెల్లూరుకు బయలుదేరాడు. రామన్నపాళెం గేటు వద్దకు వచ్చేసరికి స్కూటీ అదుపుతప్పి రోడ్డుపై పడగా కిశోర్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



దగదర్తి మండలంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

- రూ.68,30,410 విలువైన నరుకుల స్వాధీనం
- నాలుగు దుకాణాలపై 6ఏ కేసుల నమోదు

నెల్లూరు(క్రైమ్): విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జిల్లా ఎస్పీ పీఆర్ రాజేంద్రకుమార్ ఆదేశాల మేరకు విజిలెన్స్, మండల వ్యవసాయ శాఖ అధికారులు జిల్లాలోని వివిధ మండలాల్లో ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. పొదలకూరులో పలు షాపులు, నెల్లూరులోని సాయిలక్ష్మి ఫర్టిలైజర్, శ్రీ కామాక్షి రైతు డిపో, శ్రీ వెంకట పద్మావతి రైతు డిపో, దగదర్తి మండలం వెలుపోడు గ్రామంలోని శ్రీ కామాక్షి తాయి ఫర్టిలైజర్స్ దుకాణాల్లో రికార్డులను, స్టాక్‌ను పరిశీలించారు. స్టాక్‌లో వ్యత్యాసాలు, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. రూ.58,54,290 విలువైన 324.96 మెట్రిక్ టన్నుల ఎరువులు, రూ.9,76,120 విలువైన 851 లీటర్ల పురుగు మందులను స్వాధీనం చేసుకున్నారు. నాలుగు దుకాణాలపై 6ఏ కింద కేసులు నమోదు చేసి, రెండు షాపుల్లో విక్రయాలను నిలుపుదల చేశామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్లు కె.నరసింహారావు, ఎ.శ్రీహరిరావు, డీసీటీఓ విష్ణురావు, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 100	బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 208
లేయర్ (లైవ్)	: 105		
బ్రాయిలర్ చికెన్	: 188	లేయర్ చికెన్	: 178



కండలేరులో 56.172 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 56.172 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ ద్వారా 4,100, సోమశిల జలాశయం నుంచి 1,100 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 200, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 120, మొదటి బ్రాంచ్ కాలువకు 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.20
సన్నవి : రూ.15
పండ్లు : రూ.8



వృద్ధ దంపతుల ఆత్మహత్యాయత్నం

- పొలం వివాదమే కారణం
- బుచ్చిరెడ్డిపాళెంలో ఘటన

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం సమీపంలోని జెండాదిబ్బ రోడ్డులో పొలానికి సంబంధించి నెలకొన్న వివాదంలో వృద్ధ దంపతులు శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితులు, స్థానికుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం సుబ్బారెడ్డినగర్‌కు చెందిన గుంజి రమణయ్య, నాగమ్మలు జెండాదిబ్బ రోడ్డులోని ఓ రైతుకు చెందిన పొలాన్ని లీజుకు తీసుకుని కొన్ని సంవత్సరాలుగా సాగు చేస్తున్నారు. లీజు పొలానికి అనుకుని ఉన్న ప్రభుత్వ శివాయి భూమి 27 సెంట్లను కూడా వారే సాగు చేసుకుంటున్నారు. కాగా యజమాని మరొకరికి మొత్తం భూమిని విక్రయించాడు. అయితే ఆ శివాయి భూమి తమకే చెందుతుందని రమణయ్య, నాగమ్మ కొంతకాలంగా కొనుగోలు చేసిన వారితో మంతనాలు జరిపారు. వారు ఆ భూమి పూర్తిగా తమ పేరుపైనే ఉందని అడంగళ్, పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నాయని మీకెలాంటి సంబంధం లేదని సమాధానమిచ్చారు. ఈ విషయమై వృద్ధ దంపతులు కోర్టుకు వెళ్లారు.



అపస్మారక స్థితిలో రమణయ్య

- శుక్రవారం పోలీసులు వృద్ధ దంపతుల్ని స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. ఆ స్థలం కొత్తగా కొనుగోలు చేసిన వారిదేనని, తహసీల్దార్ ఇచ్చిన పత్రాలు కూడా ఉన్నాయని స్పష్టం చేశారు. యజమానులు వివాదాస్పదమైన భూమిలో కూడా కంచె వేసేందుకు యత్నించారు. దీంతో రమణయ్య, నాగమ్మలు అడ్డుకున్నారు. ఇరువర్గాలకు ఘర్షణ జరిగిన నేపథ్యంలో పోలీసులు రంగప్రవేశం చేశారు. యజమానులకు మద్దతుగా పోలీసులు వ్యవహరిస్తున్నారని, తప్పుడు డాక్యుమెంట్లతో తమను మోసం చేస్తున్నారని ఆరోపిస్తూ రమణయ్య, నాగమ్మలు పురుగు మందు తాగారు.



రోదిస్తున్న నాగమ్మ

అయినా యజమానులు కంచె వేసే పనిని పూర్తి చేసుకుని వెళ్లిపోయారు. స్థానికుల సమాచారంతో దంపతులను 108 వాహనంలో బుచ్చిరెడ్డిపాళెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించిందని డాక్టర్లు చెప్పడంతో వారి బంధువులు నెల్లూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లారు. నాగమ్మ పరిస్థితి ప్రమాదకరంగా ఉందని ఆమె కుమారుడు శ్రీనివాసులు తెలిపాడు. ఈ విషయమై ఎస్సై సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ రికార్డులు భూయజమానుల వైపే ఉన్నాయన్నారు. వృద్ధ దంపతుల వద్ద రికార్డులు ఉంటే కోర్టులో తేల్చుకోవాల్సిందిగా సూచించామన్నారు.